కూరగాయల ధరలు..

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో...)టమాటా.11, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 45, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 28, క్యాప్సికమ్ 40, పచ్చకాకర 45, పందిరి బీర 35, క్యాబేజీ 9, క్యారెట్ 17, దొండ 40, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 45, గోకరకాయ 35, కీర 16, దోసకాయ 18, బీట్‌రూట్ 13, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 24, చామగడ్డ 45, మొరంగడ్డ 23, కందగడ్డ 70, సొరకాయ 9, పొట్లకాయ 13, అరటికాయ 9, మునగకాయ 3-4, ముల్లంగి 4-5. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు టీషర్టుల పంపిణీ



పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ బోలక్‌పూర్ క్రిష్ణానగర్‌లోని మేకలమండి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మంగళవారం టీషర్టులను అందజేశారు. ఎన్‌టీపీసీ సదరన్ రీజియన్ (హెడ్‌క్వార్టర్స్) సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఈ టీషర్టులను అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌టీపీసీ జనరల్ మేనేజర్ సూర్యనారాయణ, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ప్రియాంక, హెచ్‌ఆర్ ప్రతినిధి అఖిల్ పటానాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు స్వరూప, మల్లికార్జున్‌రెడ్డి, శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



లాలాపేట: వేసవి కాలంలో ఏర్పాటు చేసే చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలనీ ఓయూ ఇన్‌స్పెక్టర్ రాజేందర్ అన్నారు. పి. మధుబాబు ఆధ్వర్యంలో తార్నాకలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చాలనే ఈ లాంటి సేవా కార్యక్రమాలు చేయడం ఎంతో అభినందనీయమన్నారు.

సందడి చేసిన టెన్త్ విద్యార్థులు




లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేటలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల (మార్కెట్ స్కూల్)లో మంగళవారం పదవ తరగతి విద్యార్థులకు తొమ్మిదవ తరగతి విద్యార్థులు ఫెయిర్ వెల్ పార్టీని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ హెడ్మాస్టర్ ప్రతాప్‌రెడ్డి.. ఈ నెల 21 నుంచి పదవ తరగతి బోర్డు పరీక్షలకు హాజరుకాబోతున్న విద్యార్థులకు బెస్ట్ విషెస్ చెప్పారు. ప్రశాంతంగా పరీక్షలు బాగా రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలనీ విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తొమ్మిదవ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.

42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: చట్ట సభల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని జై గౌడ ఉద్యమ జాతీయ అధ్యక్షులు డా.వట్టికూటి రామారావుగౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీలో బీసీ ఉద్యమం దశ-దిశ అనే అంశం పై ఓయూ ప్రొఫెసర్లు, స్కాలర్లు, విద్యార్థుల ఆధ్వర్యంలో చర్చగోష్టి జరిగింది. బహుజనులకు రాజ్యాధికారం లక్ష్యంగా బీసీ నాయకత్వంలో నూతన స్థాపించాలని పలువురు నాయకులు అభిప్రాయపడ్డారు. సామాజిక జేఏసీ చైర్మన్ ప్రొ.ప్రభంజన్ యాదవ్ అధ్యక్షత వహించగా డా.దేశగాని సాంబశివగౌడ్, డా.మాండ్ల రవి, ఓయూ అధ్యాపకులు ప్రొ.రాములు, డా.రామ్‌షఫర్డ్ తదితరులు ప్రసంగించారు.

సహజ వనరులను పరిరక్షించాలి

సాక్షి, సిటీ బ్యూరో: సహజ వనరులను పరిరక్షించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సీనియర్ పర్యావరణ ఇంజినీర్ దయానంద్ పేర్కొన్నారు. సోమాజిగూడ విల్లా మేరీ డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రపంచ రీసైక్లింగ్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసైక్లింగ్ అనేది వ్యర్థాలను తగ్గించడానికి, సహజ వనరులను పరిరక్షించడానికి, గ్రీన్ హౌస్ వాయు ఉద్గారాలను తగ్గించడానికి సహాయపడే ఒక ముఖ్యమైన పద్ధతని అన్నారు. ఈ-వ్యర్థాల నిర్వహణపై పీసీబీ ప్రాజెక్ట్ అధికారి నాగేశ్వరావు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు.



'ఈత' ఉపశమనానికి

ఇంకెన్నాళ్లు?

ఇంకా అందుబాటులోకి రాని ఈత కొలనులు

- నీటితో నింపేందుకు పాట్లు..
- సనత్‌నగర్‌లో రెండు బోర్ల ద్వారా..
- అమీర్‌పేటలో జలమండలి ట్యాంకర్ల కోసం ఎదురుచూపులు..
- రూ.80 ట్యాంకర్లకు రూ.68,000 చెల్లింపు..
- ఏప్రిల్ 1 నాటికి అందుబాటులోకి తీసుకువచ్చే యోచనలో అధికారులు..

సనత్‌నగర్: భానుడు భగభగమంటున్నాడు. ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు సిటీజనులు 'చల్లని' మార్గాలను అన్వేషిస్తున్నారు. ఈ క్రమంలోనే సనత్‌నగర్ లేబర్ వెల్ఫేర్ గ్రౌండ్‌లోని స్విమ్మింగ్‌పూల్ (ఈత కొలను) ఎప్పుడెప్పుడు అందుబాటులోకి వస్తుందా? అని ఎదురుచూస్తున్నారు. అసలే ఎండలు తీవ్రమవుతున్న దృష్ట్యా కాసేపు స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొట్టేందుకు యువత ఉవ్విళ్లూరుతున్నారు. అందుకోసం ప్రతిరోజూ ఇక్కడికి వచ్చి స్విమ్మింగ్‌పూల్ ప్రారంభమైందా? లేదా అని ఆరా తీసి వెళ్తున్నారు. వాస్తవంగా చలికాలంలో మూడు నెలల పాటు స్విమ్మింగ్ పూల్‌ను మూసివేసి ఉంచుతారు. గత ఏడాది సరిగ్గా వేసవికాలానికి ముందు ఓ బాలుడు స్విమ్మింగ్‌పూల్‌లో పడి మృతి చెందడంతో ప్రారంభించలేదు. 2023 వేసవిలో అందుబాటులోకి వచ్చిన స్విమ్మింగ్‌పూల్ మళ్లీ ఈ ఏడాది పునః ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే క్లీనింగ్ పనులు పూర్తికాగా నీటితో నింపే పనులు జరుగుతున్నాయి. స్విమ్మింగ్‌పూల్‌లోని ఓ బోర్‌తో పాటు జీహెచ్ఎంసీ లేబర్ వెల్ఫేర్ గ్రౌండ్‌లోని మరో బోర్ నీటితో నింపే ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే బోర్లు కూడా అడుగంటిపోవడంతో ఉదయం 2 గంటలు, సాయంత్రం మరో 2 గంటల పాటు మాత్రమే బోర్ల ద్వారా నీటిని స్విమ్మింగ్‌పూల్‌కు పంపిస్తున్నారు.

అమీర్‌పేట స్విమ్మింగ్‌పూల్ పరిస్థితి అంతే..

అమీర్‌పేట ధరంకరం రోడ్డులోని గురుగోబింద్‌సింగ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని స్విమ్మింగ్‌పూల్‌ను సైతం నెమ్మదినెమ్మదిగా నింపుతున్నారు. జలమండలి పైప్‌లైన్ ద్వారా సరఫరా చేసే నీటితో కొంచెం కొంచెం నింపే ప్రయత్నం చేస్తున్నారు. అయితే 160 ట్యాంకర్ల సామర్థ్యం కలిగిన ఈ ఈత కొలనుకు నీటి సరఫరా చేయాలంటూ ఇప్పటికే జలమండలికి 80 ట్యాంకర్లకు గాను రూ.68,000 చెల్లించారు. వారు రేపుమాపంటూ కాలం వెళ్లదీస్తుండడంతో స్విమ్మింగ్‌పూల్ పునః ప్రారంభ ప్రక్రియలో తీవ్ర జాప్యం నెలకొంటోంది.



అమీర్‌పేట ఈత కొలను..

ఏప్రిల్ 1 నాటికి పునః ప్రారంభించే యోచనలో..

ఈ వేసవిలో స్విమ్మింగ్‌పూల్‌ను ప్రారంభించేందుకు గత రెండు నెలలుగా అందుకు సంబంధించిన పనులు చేస్తూ వస్తున్నారు. 5.50 లక్షల లీటర్ల నీటి సామర్థ్యం (సుమారు 160 ట్యాంక్‌లు) ఉన్న స్విమ్మింగ్‌పూల్‌ను సామర్థ్యానికి తగ్గట్లుగా నీటితో నింపడంతో పాటు ఇక్కడికి ఈత కోసం వచ్చే వారు స్నానాలు చేయడం కోసం బ్యాలెన్సింగ్ ట్యాంక్‌ను సైతం 50వేల లీటర్ల నీటితో నింపాల్సి ఉంది. ప్రస్తుతం స్విమ్మింగ్‌పూల్ నింపడమే పూర్తికాలేదు. ఇంకా బ్యాలెన్సింగ్ ట్యాంక్ ఎప్పుడు నిండుతుందా? అని స్విమ్మింగ్ ప్రియులు ఎదురుచూస్తున్నారు. అధికారులేమో ఏప్రిల్ 1 నాటికి అందుబాటులోకి వస్తుందని చెబుతున్నారు.

విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ

లాలాపేట: రాష్ట్రీయ బాలస్వాస్థ కార్యక్రమంలో భాగంగా మంగళవారం లాలాపేటలోని మార్కెట్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి కళ్లద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత నెల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గాంధీ హాస్పిటల్ కంటి వైద్యుల సహకారంతో వైద్య శిబిరాల ద్వారా ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారన్నారు. దృష్టి లోపంతో బాధపడుతున్న వారికి కళ్లద్దాలను అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. డాక్టర్ జయశ్రీ, ఆర్‌బీఎస్‌కే మెడికల్ ఆఫీసర్లు సరిత, వీరు కాసర్ల పాల్గొన్నారు.



విద్యార్థులకు కళ్లద్దాలను పంపిణీ చేస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్‌రెడ్డి

దశల వారీగా సమస్యల పరిష్కారం: ఎమ్మెల్యే శ్రీగణేశ్



డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: దశల వారీగా నియోజకవర్గం పరిధిలోని సమస్యలు పరిష్కరిస్తూ, అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. నాలుగో వార్డు హరిజన బస్తీలో రూ.15.3 లక్షల నిధులతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పనులకు బోర్డు సభ్యురాలు భానుక నర్మద మల్లికార్జున్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలోనే కంటోన్మెంట్ ప్రాంతాన్ని సమస్యలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. అనంతరం మారేడుపల్లి పోలీసు స్టేషన్ వెనుక బస్తీలో పర్యటించి బస్తీ సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్, బీజేపీనేతలు, కార్యకర్తలతో పాటు స్థానికులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

సికింద్రాబాద్: అసెంబ్లీ సమావేశాల్లో ఉద్యమకారుల అంశంపై మాట్లాడాలని కోరుతూ మంగళవారం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ప్రతినిధులు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లూరి అనిల్‌కుమార్ నేతృత్వంలో ఫోరం ప్రతినిధులు మంగళవారం మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రిని ప్రభాకర్‌ను కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం పెన్షన్ మంజూరు వంటి హామీలు ఇచ్చి ఇప్పటి వరకు ప్రారంభించలేదన్నారు. ఉద్యమకారుల ఫోరం నాయకులు జానకి రెడ్డి, జగన్ యాదవ్, నరసింహ చారిలు పాల్గొన్నారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఉద్యమకారుల ఫోరం ప్రతినిధులు

ఘనంగా టీ9 ఛాలెంజ్ గోల్ఫ్ టోర్నీ ప్రారంభం



సాక్షి, సిటీబ్యూరో: గోల్ఫ్ క్రీడను ప్రమోట్ చేసే ఉద్దేశంతో నిర్వహిస్తున్న ఆరో రియాల్టీ టీ9 ఛాలెంజ్ మూడో సీజన్ బౌల్డర్ హిల్స్ గోల్ఫ్ - కంట్రీ క్లబ్ లో ఘనంగా ప్రారంభమైంది. ఈ టోర్నమెంట్‌లో 16 జట్ల నుంచి 128 మంది గోల్ఫర్లు పాల్గొంటున్నారు. ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్ తెలంగాణలో గోల్ఫ్ క్రీడకు సంబంధించి మరింత పోటీతత్వాన్ని పెంచబోతోందనీ టీగోల్ఫ్ ఫౌండేషన్ అధ్యక్షుడు, సీఈఓ డాక్టర్ ఎస్‌ఆర్ ఎస్ రెడ్డి చెప్పారు. టీ9 ఛాలెంజ్ గోల్ఫింగ్ ప్రతిభను ప్రదర్శించడానికి, భవిష్యత్ ఛాంపియన్లను తయారుచేయడానికి ఒక కీలకమైన వేదికగా పనిచేస్తుందనీ ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్ వి. చాముండేశ్వరనాథ్ చెప్పారు. టైటిల్ స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్న ఆరో రియాల్టీ మార్కెటింగ్ హెడ్ సిద్ధార్థ్ మాల్, సేల్స్ హెడ్ శ్రీ పునీత్ కుమార్‌లను టీ గోల్ఫ్ ఫౌండేషన్ తరఫున సత్కరించారు.

ఇందిరానగర్‌లో తాగునీటి సమస్యకు చెక్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని ఇందిరానగర్, జవహర్ కాలనీల్లో మంచినీటి సమస్యకు అధికారులు పరిష్కారం చూపారు. రూ. 67 లక్షల వ్యయంతో భారీ మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులకు బుధవారం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ శంకుస్థాపన చేయనున్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 14 కొబ్బరిబోండాల చౌరస్తా నుంచి ఎన్టీఆర్ భవన్ వరకు 450 ఎంఎం డయా పైప్‌లైన్ నిర్మాణం చేపట్టడం ద్వారా ఇందిరానగర్, జవహర్ కాలనీల్లో ఇప్పుడున్న మంచినీటి సమస్య పూర్తిగా పరిష్కారం కానుంది. తట్టికాన వాటర్ రిజర్వాయర్ నుంచి నీటి సరఫరా చేయనున్నారు. ఈ పైప్‌లైన్ నిర్మాణం కోసం ట్రాఫిక్ పోలీసులు క్లియరెన్స్ కూడా ఇచ్చారు. పది రోజుల్లో పైప్‌లైన్ పనులు పూర్తి చేయాలని జలమండలి అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుతం ఈ రెండు బస్తీల్లో నీటి సమస్య తీవ్రంగా ఉండగా 40 ఏళ్ల క్రితం వేసిన పైపులద్వారా నీళ్లను సరఫరా చేస్తుండటంతో చాలినన్ని నీళ్లు రావడం లేదు. ప్రస్తుతం వేయబోయే లైన్ ద్వారా ఈ సమస్యకు చెక్ పెడుతున్నారు.

దళారులను నమ్మితే నష్టం తప్పదు





అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న బోర్డు అధికారులు

కంటోన్మెంట్: కంటోన్మెంట్ బోర్డు అనుమతి లేకుండా చేపట్టే నిర్మాణాలపై చర్యలు తప్పవని కంటోన్మెంట్ ఇంజనీర్ ఉమాశంకర్ అన్నారు. ఏడోవార్డు పరిధిలోని టీచర్స్ కాలనీ ప్లాట్ నెంబర్ 5లో చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని ఆయనతో పాటు కంటోన్మెంట్ చీఫ్ ప్లానర్ ఫణికుమార్ ఆధ్వర్యంలోని బోర్డు అధికారుల బృందం కూల్చివేసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణదారులు బోర్డు నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. దళారుల మాటలు నమ్మి, అనుమతిలేని, అదనపు అంతస్తుల నిర్మాణం చేపట్టవద్దన్నారు. తద్వారా లక్షలాది రూపాయలు నష్టపోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కంటోన్మెంట్ వ్యాప్తంగా నిబంధనలకు విరుద్ధంగా చేపట్టే నిర్మాణాలను కూల్చివేస్తామన్నారు. కూల్చివేత కార్యక్రమంలో బోర్డు ఇంజనీర్‌లు రాజేశ్వర్, కృష్ణకాంత్ రెడ్డి, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో సంబరాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఎస్సీ వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందడం పట్ల మాదిగ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్, బహుజన విద్యార్థి సంఘాలు, ఇతర సంఘాలలోని మాదిగ విద్యార్థులు, యువకులు డప్పుడులు కొడుతూ ఆనందోత్సవాల నడుమ బాణ సంచ కాల్చి స్వీట్లు పంచుకొని నృత్యాలు చేశారు.



తల్లిదండ్రులకు పాదపూజ



తల్లిదండ్రులకు పాద పూజ చేస్తున్న విద్యార్థులు

రాంగోపాల్‌పేట్: పిల్లలకు తల్లిదండ్రులు, పెద్దలు, కుటుంబ సభ్యుల పట్ల గౌరవం పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎస్వీఐటీ చైర్మన్ పీఎల్ శ్రీనివాస్ సూచించారు. సికింద్రాబాద్ మహబూబ్ కళాశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి తల్లిదండ్రులకు పాదపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలికే కార్యక్రమానికి భిన్నంగా హెచ్ఎం యాదగిరి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇలాంటి కార్యక్రమాలతో వారి పట్ల గౌరవం పెరుగుతుందన్నారు. మోటివేషనల్ స్పీకర్ అప్పల ప్రసాద్, కళాశాల మేనేజింగ్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ నరేష్ కళాశాల డైరెక్టర్ సునీల్ కుమార్ పాల్గొన్నారు.

మద్యం తాగి న్యూసెన్స్.. ముగ్గురికి రెండు రోజుల జైలు

సనత్‌నగర్: బహిరంగ ప్రదేశంలో మద్యం తాగడమే కాకుండా న్యూసెన్స్‌కు పాల్పడిన ముగ్గురికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. వివరాల్లోకి వెళితే..నానక్‌రాంగూడకు శంకర్‌దాస్, జీడిమెట్లకు చెందని అవినాష్‌కుమార్, సోహిత్‌కుమార్‌లు పరేడ్‌గ్రౌండ్ వద్ద మద్యం తాగి న్యూసెన్స్‌కు పాల్పడుతున్నారు. పోలీసులకు సమాచారం అందడంతో అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. వీరికి న్యాయస్థానం రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు.

రేవంత్ రెడ్డి సర్కార్‌కు గుణపాఠం చెబుతాం

ఉస్మానియా యూనివర్సిటీ: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ పై దేశంలో ఏ రాష్ట్రం చూపని శ్రద్ధ సీఎం రేవంత్ రెడ్డి చూపించారని ఆయన ప్రభుత్వానికి త్వరలో తగిన గుణపాఠం చెబుతామని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు డాక్టర్ పబ్బతి శ్రీకృష్ణ మంగళవారం హెచ్చరించారు. రాష్ట్రంలో బహుజన ఉద్యమాలు బలపడుతున్న తరుణంలో ఎస్సీలను విభించి రాజకీయ లబ్ధిపొందాలని చూస్తున్న సీఎం రేవంత్ రెడ్డి ఇక రోజులు లెక్కపెట్టుకోవాలన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం కొందరు మాల నేతలు సీఎం రేవంత్ రెడ్డికి భజన చేస్తూ పదవులు పొందుతున్నారని ధ్వజమెత్తారు.

విద్యా రంగానికి 20 శాతం బడ్జెట్ కేటాయించాలి

లిబర్టీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శాసన సభలో ప్రవేశపెట్టబోయే రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి 20 శాతం బడ్జెట్ కేటాయించాలని ఆమ్‌ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ధనిక రాష్ట్రంగా చెప్పుకునే తెలంగాణ విద్యా రంగంలో దేశంలో చివరి స్థానంలో ఉండడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగ ప్రాముఖ్యతను గుర్తించాలని, ఈ బడ్జెట్‌లో విద్యకు అధిక నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల మూసివేతను తక్షణమే నిలిపి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సమస్యలను పరిష్కరించి మౌలిక సౌకర్యాలు కల్పించి బలోపేతం చేయాలన్నారు.

డబుల్ బెడ్రూమ్ ఇళ్లు మంజూరు చేయాలి

అడ్డగుట్ట: ఆజాద్ చంద్రశేఖర్ నగర్‌లోని అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్రూమ్ ఇండ్లు మంజూరు చేయాలని కోరుతూ బస్తీవాసులు మంగళవారం మారేడుపల్లి తహసీల్దార్ భీమయ్య గౌడ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బస్తీవాసులు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా నివాసముంటున్న తమకు 2010వ సంవత్సరంలో పొజిషన్ సర్టిఫికెట్లు ఇచ్చారన్నారు. అయితే ఇది వరకు జెఎన్ఎన్‌యూఆర్ఎం పథకం ద్వారా 192 మంది లబ్ధిదారులకు ఇండ్లు నిర్మించి ఇచ్చారని, అదే విధంగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 48 డబుల్ బెడ్రూమ్‌లు నిర్మించి అర్హులకు అందజేసినట్లు తెలిపారు. అయితే, పట్టాలు, పొజిషన్ సర్టిఫికెట్లు ఉన్న అర్హులైన మిగిలిన కుటుంబాలకు కూడా నగరంలో లేదా నగర శివార్లలో నిర్మించినటువంటి డబుల్ బెడ్రూమ్‌లు కేటాయించాని కోరారు.

కారు దొంగ రిమాండ్

పంజగుట్ట: ఖరీదైన కారును దొంగతనం చేసిన కేసును పంజగుట్ట పోలీసులు ఛేదించారు. అమీర్‌పేటకు చెందిన ప్రసాద్ ఆదివారం రాత్రి గ్రీన్‌పార్క్ హోటల్ ఎదురుగా మద్యం కొనుగోలు చేసేందుకు తన ఎంజీ హెక్టార్ కారులో వెళ్లాడు. కారు ఆఫ్ చెయ్యకుండా మద్యం కొనేందుకు లోపలికి వెళ్లగానే గుర్తు తెలియని వ్యక్తి వచ్చి కారుతో ఉడాయించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు అక్కడి సీసీ కెమెరాలు పరిశీలించి రఘునాథ్ (29)గా గుర్తించారు. మహారాష్ట్రకు చెందిన రఘునాథ్ అమీర్‌పేట, లాల్‌బంగ్లా సమీపంలో ఉంటూ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తుంటాడు. మోనప్పా సర్కిల్ వద్ద అదుపులోకి తీసుకున్న పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

నకిలీ ఓట్లను తొలగించాలి

సనత్‌నగర్: ఓటరు జబితాపై అభ్యంతరాల స్వీకరణకై అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నేతలతో మంగళవారం బేగంపేట సర్కిల్ కార్యాలయంలో సమావేశం జరిగింది. సనత్‌నగర్ నియోజకవర్గ ఎలక్ట్రోరల్ అధికారి సమ్మయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాజకీయ ప్రతినిధుల అభ్యంతరాలను స్వీకరించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఓటరు జాబితాను సంవత్సరానికి నాలుగుసార్లు సవరిస్తుందని ఈ సందర్భంగా సమ్మయ్య వారికి తెలియజేశారు. నకిలీ ఓట్ల తొలగింపు, ఖచ్చితమైన సమస్యలను పరిష్కరించడంలో బూత్ లెవల్ అసిస్టెంట్‌కు బూత్ లెవల్ ఆఫీసర్లు సహకారం అందించాలని కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ కోరారు. ఓటర్ల జాబితాలో ఖచ్చితత్వం కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఉపయోగించుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నేత విశాల్ సూదం విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొంతం దీపిక పాల్గొన్నారు.



సమావేశంలో సనత్‌నగర్ నియోజకవర్గ ఎలక్ట్రోరల్ అధికారి సమ్మయ్య

మాయ మాటలు చెప్పి బ్లాక్ మెయిల్

యువకుడిపై బాధితురాలి ఫిర్యాదు

అమీర్‌పేట్: యువతిని బ్లాక్ మెయిల్ చేస్తున్న ఓ వ్యక్తిపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సార్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి కథనం ప్రకారం..ఎస్సార్‌నగర్‌కు చెందిన యువతి (20) బీటెక్ మూడో సంవత్సరం చదువుతోంది. ఏడాది క్రితం తేమలి పుజారా రమేష్ (24) పరిచయమయ్యాడు. తాను పోలీస్ కానిస్టేబుల్‌నని పరిచయం చేసుకున్నాడు. ఫోన్ నెంబర్ తీసుకుని స్నేహం చేశాడు. ఓ రోజు ఎస్సార్‌నగర్‌లోని కాఫీ షాప్‌లో కలిసినప్పుడు ఆమె ఫోన్‌లోని కాంటాక్ట్స్ అన్నీ తన ఫోన్‌కు ఫార్వార్డ్ చేసుకున్నాడు. కొన్నాళ్లకు ఆమెను బ్లాక్ మెయిల్ చేయడం ప్రారంభించాడు. చెప్పినట్టు వినకపోతే ఫోటోలను, వీడియోలను మార్ఫింగ్ చేసి కాంటాక్ట్స్ అందరికీ పంపుతానని బెదిరింపులకు గురిచేశాడు. దీంతో యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సార్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌పై వచ్చి మూకుమ్మడిగా కత్తితో దాడి

సనత్‌నగర్: సినీ ఫక్కీలో ఓ వ్యక్తిని ద్విచక్ర వాహనంపై వచ్చిన ముగ్గురు వ్యక్తులు కత్తుతో దాడి చేశారు. ఈ ఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. ఆటోట్రాలీ నడిపించుకుంటూ జీవనం సాగించే వెంకటేష్‌యాదవ్ (35) బేగంపేట భగవంతాపూర్‌లో ఉంటున్నాడు. మంగళవారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై ముగ్గురు వ్యక్తులు భగవంతాపూర్‌కు వచ్చి వెంకటేష్‌యాదవ్‌పై కత్తులతో దాడికి యత్నించారు. దీంతో వెంటనే వెంకటేష్ వారి నుంచి తప్పించుకునేందుకు పారిపోతుండగా వెంబడించారు. దుండగులు కత్తితో దాడి చేయడంతో భగవంతాపూర్ పార్కు వద్ద కింద పడిపోయాడు. జన సంచారం ఎక్కువగా ఉండడంతో దుండగులు పారిపోయారు. సంఘటన స్థలానికి ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు సిబ్బందితో చేరుకుని వివరాలు సేకరించారు. బాధితుడిని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.



దాడిలో గాయపడ్డ వెంకటేష్‌యాదవ్